క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ



శివాలయంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం (శివాలయం) ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలోని యాగశాలలో సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు, వల్లీదేవి దంపతులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అలాగే ప్రతిష్ఠకు ముందు ధ్వజస్తంభానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఉదయం 11 గంటలకు ఆలయ పండితులు ప్రత్యేక పూజలు చేసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

గోకవరం: కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని రాజుపాలెం రామాలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. సనాతన ధర్మ ప్రబోధన సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో రాజుపాలెంలో రామాలయాన్ని పునర్నిర్మించారు. కొత్తపల్లికి చెందిన తోట పద్మనాభం, సంధ్యాదేవి దంపతులు పీటలపై కూర్చొని సీతారామ, లక్ష్మణుల విగ్రహాల ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ జనపరెడ్డి బాబు, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

జంతువులను గుర్తించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న వన్యప్రాణి, అటవీ సిబ్బంది

గండేపల్లి: లేగదూడలపై దాడిచేసిన అడవి జంతువులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సిద్ధార్థ తెలిపారు. మండలంలోని మల్లేపల్లిలో పొలంలో కట్టి ఉంచిన పశువులపై గుర్తుతెలియని అడవి జంతువులు దాడిచేసి లేగదూడను హతమార్చిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ఆ జంతువులు సంచరించిన ప్రదేశాలు, వచ్చిన మార్గాల్లో పాదముద్రల ఆధారంగా సీసీ కెమెరాలు ఆదివారం ఏర్పాటు చేశారు. సంఘటన ప్రదేశానికి అటవీప్రాంతం దగ్గరగా ఉండటం వల్ల అడవి జంతువులు పశువులపై దాడి చేసి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

ముగిసిన తంటికొండ వెంకన్న కల్యాణోత్సవాలు



తంటికొండ వెంకన్నకు శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి ఈఓ ఆర్‌వీ చందన ఆధ్వర్యంలో స్వామివారికి ఊయల సేవ, శ్రీపుష్పయాగం నిర్వహించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈఓ చందన మాట్లాడుతూ ఈ ఏడాది భక్తుల సహకారంతో స్వామివారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించినట్టు తెలిపారు.

పేకాడుతున్న ఇద్దరి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మామిడాడ శివారులో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2000 స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. నిందితులను పెద్దాపురం కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

తడిసిన పంటల పరిశీలన

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు కళ్లాల్లో తడిసిన మొక్కజొన్న పంటను ఆదివారం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

వేసవి శిక్షణ... భవితకు రక్షణ

- నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు
- విద్యార్థులకు పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ
- బయట పడనున్న సృజనాత్మకత



గోకవరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంపై ప్రచారం నిర్వహిస్తున్న అధికారులు

గోకవరం: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జనకు నిలయాలు. పుస్తక పఠనంతో జ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఒకప్పుడు గ్రంథాలయాలకు పాఠకుల తాకిడి ఎక్కువగా ఉండేది. ఉదయం, సాయంత్రం విధిగా గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేసేవారు. రానురాను ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం సెల్‌ఫోన్లకు బానిసలు కావడం, సోషల్ మీడియా నేపథ్యంలో పుస్తక పఠనం పట్ల పెద్దలకు, చిన్నారులకు సైతం ఆశక్తి తగ్గింది. దీనివలన గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా పుస్తక పఠనంపై ఆశక్తి పెంచేందుకు ఏటా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఈ ఏడాది వేసవి విజ్ఞాన శిబిరాలను ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 11 వరకు నిర్వహిస్తుంది.

పలు అంశాలపై శిక్షణ

గ్రంథాలయాల్లో ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తారు. విద్యార్థులతో కథలు చెప్పించడం, చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్, బొమ్మల తయారీ, తెలుగు పద్యాలు చదివించడం వంటి పలు అంశాలపై శిక్షణ ఇస్తారు. ఇందు కోసం ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ముందుకు రావాలని గ్రంథాలయ శాఖ కోరింది.

నియోజకవర్గంలో..

జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం, మల్లవరం జగ్గంపేట, కిర్లంపూడి, గెద్దనాపల్లి, వీరవరం, గండేపల్లి, మురారి గ్రామాల్లో శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. ఈ గ్రంథాలయాల్లో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా వారిలో సృజనాత్మక శక్తి పెరిగి తద్వారా చదువులో బాగా రాణించే అవకాశం ఉంది. అలాగే ఆయా గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్ కూడా అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాల అధికారులు కోరుతున్నారు.

నేడు ప్రారంభం

కోటనందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి బి.నాగరత్నం కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జూన్ 11 వరకూ వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్, కథలు చెప్పడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు వేసవి శిబిరానికి వెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆమె కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయాల్లో సుమారు నెల రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాలు జరుగుతాయి. విద్యార్థులు ఈ శిబిరాలకు హాజరు కావడం ద్వారా చదవడం, కథలు చెప్పడం వంటివి నేర్చుకుంటారు. వీటి ద్వారా వారిలో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తి బయటకు వస్తుంది. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.ప్రియదర్శిని, గ్రంథాలయాధికారి, గోకవరం



గ్రంథాలయంలో విద్యార్థుల కోసం అందుబాటులో ఉన్న పుస్తకాలు

గొరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



గొరంపేటలో జేసీబీతో వ్యర్థాల తొలగింపు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గొరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గొరంపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

తుని: వేసవి సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు చోరీలపై అప్రమత్తంగా ఉండాలని తుని పట్టణ సీఐ నాగ దుర్గారావు సూచించారు. పట్టణంలోని ప్రజలకు ఆదివారం చోరీల నివారణపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయాలకు, టూరిస్ట్ ప్రదేశాలకు వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటిలో విలువైన వస్తువులను ఉంచవద్దని, బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో చోరీలకు తావులేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నివాస ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే అందుబాటులో ఉన్న పోలీసులకు తెలియపరచాలన్నారు. రాత్రి సమయాల్లో ప్రత్యేక పోలీస్ గస్తీని ఏర్పాటు చేశామని, ప్రజల ఆస్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- రౌతులపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం



రౌతులపూడిలో దివ్యాంగురాలికి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

రౌతులపూడి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన రౌతులపూడిలో ఆదివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. డ్రైన్లు, రోడ్లు, వీధిలైట్లు, తాగునీరు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సచివాలయ, గ్రామ వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు విత్తనాలు, ఎరువులు, ఇతర రాయితీలను అందిస్తూ వ్యవసాయానికి పెద్దపీట వేశారన్నారు. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహాకమిటీ ఛైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ కటారి అర్జునమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం రైల్వేస్టేషన్‌లో తేనెపట్టు

- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు



అన్నవరం రైల్వేస్టేషన్‌లో పట్టిన తేనెపట్టు

అన్నవరం: వేలాది మంది ప్రయాణికులు, భక్తులు ప్రతినిత్యం ప్రయాణించే అన్నవరం రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాం లిఫ్ట్ వద్ద తేనెపట్టు పట్టింది. అక్కడ తేనెటీగలను చూసి ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రెండు, మూడో నంబర్ ప్లాట్‌ఫాంలు కలిసే ఉంటాయి. మూడో నంబర్ ప్లాట్‌ఫాం మీద విశాఖపట్నం వైపు వెళ్లే రైళ్లు ఆగుతాయి. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు సుమారు 20 రైళ్లకు ఇక్కడ హాల్ట్ ఉంది. ఆ రైళ్లలో దిగిన ప్రయాణికులు రెండో నంబర్ ప్లాట్‌ఫాం మీద గల లిఫ్ట్ ద్వారా ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా వెలుపలకు వచ్చి అక్కడ నుంచి అన్నవరం దేవస్థానానికి వెళ్లే వాహనాల స్టాండ్‌కు వస్తారు. వీరిపై తేనెటీగలు దాడిచేసే అవకాశం ఉండడడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అన్నవరం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్‌త్రినాథ్‌రెడ్డిని వివరణ కోరగా సమస్యను సామర్లకోట రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

దశాబ్దాల కల సాకారం



రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

- రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు
- స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే, సీఐ

రౌతులపూడి: మండల ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ కృషితో ఎట్టకేలకు మండల కేంద్రమైన రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇక్కడ పోలీస్ స్టేషన్ లేకపోవడంతో దశాబ్దాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలం ఏర్పడి 20 ఏళ్లు గడిచినా స్థానికంగా పోలీస్ స్టేషన్ లేకపోవడంతో పక్క మండలాలైన కోటనందూరు, అన్నవరం, తుని రూరల్ పోలీస్ స్టేషన్‌లను ప్రజల ఆశ్రయించి తమ సమస్యలు పరిష్కరించుకునేవారు.

పలుమార్లు వినతి

మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు స్థానికులు వినతి పత్రాలు అందజేశారు. గత పాలకులు ప్రజల వినతులను పట్టించుకోలేదు. కాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పోలీస్ ఏర్పాటుకు భగీరథ ప్రయత్నం చేశారు. ఈ మేరకు అధికారులు స్పందించి ఇక్కడ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కాగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆదివారం ప్రత్తిపాడు సీఐ కె.కిశోర్‌బాబుతో కలసి ఎమ్మెల్యే పర్వత స్థల పరిశీలన చేశారు. రౌతులపూడిలో పాత ప్రభుత్వ భవనాలు, మార్కెట్ దగ్గర ఉన్న పాత పంచాయతీ కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయం వంటి పలు భవన సముదాయాలను పరిశీలించారు. వీలైనంత త్వరగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహాకమిటీ ఛైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, వైస్ ఎంపీపీ సూరెడ్డి సాయి, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ కటారి అర్జునమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, ఎంపీడీఓ ఎం.గోవింద్, అన్నవరం అదనపు ఎస్.ఐ అజయ్‌బాబు పాల్గొన్నారు.

ఏలేరులో 76.74 మీటర్ల నీటి నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటినిల్వలు

ఏలేశ్వరం: వేసవి ఎండలకు స్థానిక ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ప్రాజెక్టులో ఆదివారం నాటికి రూ.86.56 మీటర్లకు గాను 76.74 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 9.94 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం విశాఖకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టుకు, పంపాకు, తిమ్మరాజుచెరువుకు నీటి విడుదల నిలిపివేశారు. ఈ ఏడాది వర్షాలకు అనుకున్న స్థాయిలో ప్రాజెక్టులో నీటినిల్వలు చేరినా ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరగడంతో స్వల్పంగా నీటినిల్వలు తగ్గాయి.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

జగ్గంపేట: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని స్థానిక ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని, ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌కు హాజరువాలని హెచ్చరించారు. ప్రతిఒక్కరి కదలికలపై నిఘా ఉంచుతామన్నాని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తొండంగి యూపీ స్కూల్లో కలిసిన పూర్వ విద్యార్థులు

తొండంగి: స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 16 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని అలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు.

విప్లవవీరుడు అల్లూరికి ఘన నివాళులు



భద్రవరంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ శ్రేణులు



ప్రత్తిపాడులో అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను



బూరుగుపూడిలో అల్లూరి విగ్రహానికి జోహార్లు అర్పిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

ఏలేశ్వరం: రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం నిర్వహించారు. మండలంలోని భద్రవరంలో సీఐటీయూ మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, పిల్లా రాంబాబు ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పెదపాటి గురయ్య, రేఖా అమ్మాజీ, ఉగ్గిన రామం తదితరులు పాల్గొన్నారు. ఏలేశ్వరం పట్టణంలో సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొండతిమ్మాపురంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా అల్లూరి వర్ధంతి

ప్రత్తిపాడు: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లోని అల్లూరి విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, కె. సూరిబాబు, బి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడిలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఏపీ రైతు కూలీసంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరంజనేయులు ఆధ్వర్యంలో పూలమాల నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి చేసిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో కర్నాకుల సూరిబాబు, కర్రి సుబ్రహ్మణ్యం, కుంచె వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు, పాదురుపాక, చింతలూరు, వెంకటనగరం గ్రామాల్లో ఆదివారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అల్లూరి విగ్రహాలకు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి సేవలను, పోరాటాలను కొనియాడారు. లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు మానుకొండ లచ్చబాబు, రేచుకట్ల సింహాచలం, తాడి నాగేశ్వరరావు, అడ్డాల వెంకట్రావు, ఇరటా వీరబాబు, రేచుకట్ల రాంబాబు, రెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పదిలో మెరిసిన విద్యాకుసుమాలు

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ మార్కులు సాధించారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలువురు పేద విద్యార్థులు 570 పైగా మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించామని విద్యార్థులు చెబుతున్నారు.



విద్యార్థి పేరు : కేఎస్ఎస్ జోహార్
మార్కులు : 573
తల్లిదండ్రులు : తండ్రి ఆర్ఎంపీ డాక్టర్, తల్లి గృహిణి
విద్యార్థి లక్ష్యం : ఎంబీబీఎస్



విద్యార్థి పేరు : బి.సూర్య రామతులసి
మార్కులు : 567
తల్లిదండ్రులు : వ్యవసాయం
విద్యార్థి లక్ష్యం : ఇంజినీర్



విద్యార్థి పేరు : ఆరుగుల మధుశ్రీ
మార్కులు : 578
తల్లిదండ్రులు : తండ్రి లేడు, తల్లి రోజు కూలీ
విద్యార్థి లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



విద్యార్థి పేరు : డి. దుర్గాప్రసాద్
మార్కులు : 568
స్కూల్ : జగ్గంపేట హైస్కూల్
తల్లిదండ్రులు : డి.సత్యనారాయణ (ఆర్ఎంపీ డాక్టర్) డి.విష్ణుప్రియ (గృహిణి)
విద్యార్థి లక్ష్యం : ఇంజినీరింగ్



విద్యార్థి పేరు : ఎం.మహేష్
మార్కులు : 571
పాఠశాల : కాత్రావులపల్లి జెడ్పీ హైస్కూల్
తల్లిదండ్రులు: ఎం.సత్తిబాబు, అనంత లక్ష్మి
వృత్తి : వెల్డర్
విద్యార్థి లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



విద్యార్థిపేరు: నీలి కావ్యశ్రీ
మార్కులు: 558
పాఠశాల: బొద్దవరం జెడ్పీ హైస్కూల్
తల్లిదండ్రులు: నీలి ఆదినారాయణ, సావిత్రి
వృత్తి : టైలర్
విద్యార్థి లక్ష్యం: ట్రిపుల్ ఐటీ



విద్యార్థిపేరు : గంటా తులసి
మార్కులు : 557
పాఠశాల : కోటనందూరు జెడ్పీ హైస్కూల్
తల్లిదండ్రులు : గంటా కొండ బాబు, లోవలక్ష్మి
వృత్తి : వ్యవసాయం
విద్యార్థి లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



విద్యార్థి పేరు : పి.రాజేష్
మార్కులు : 562
తల్లిదండ్రులు : తండ్రి లారీ డ్రైవర్, తల్లి గృహిణి
విద్యార్థి లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఉద్యోగం



పేరు : కరణం హిమాబిందు
పాఠశాల : ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కిర్లంపూడి
మార్కులు : 578
లక్ష్యం : సీఏ
తల్లిదండ్రులు : టైలర్, గృహిణి



విద్యార్థిపేరు: బూసాల వెంకట దుర్గ వీర మౌనిక
మార్కులు: 570
పాఠశాల : గండేపల్లి ఉన్నత పాఠశాల
తల్లి: అమలావతి, గృహిణి.
తండ్రి: సూర్యనారాయణ, వ్యవసాయం
విద్యార్థి లక్ష్యం: ఇంజినీరింగ్